క్లుప్తంగా

22 నుంచి నాగావళి నదీ మాతృకా హారతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత శ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఈనెల 22 నుంచి నాగావళి నదీ మాతృకా హారతులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావులు తెలిపారు. నవంబరు 20వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపారాధన, నాగావళి నదికి 16 రకాల హారతులు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చిన భక్తులకు అరటిదొప్పలు, వత్తులు అందజేస్తామని తెలిపారు. నవంబర్ 1న ఏకాదశి పురస్కరించుకొని సహస్ర దీపాల సేవ ఉంటుందని పేర్కొన్నారు. 2న చిలుకల ద్వాదశిని పురస్కరించుకొని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 6 గంటలకు కార్తీక దీపోత్సవం, తెప్పోత్సవం జరుగుతుందని తెలిపారు. 21న అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులంతా కార్తీక మాసం నెల రోజులు పాల్గొనాలని కోరారు.

నీటి నిల్వలు తొలగింపు



జేసీబీతో పనులు చేపడుతున్న దృశ్యం

గార: మండలంలోని కళింగపట్నం పంచాయతీ చిన్నపల్లిపేట వద్ద వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో స్థానిక కుటుంబాలు పడుతున్న ఇబ్బందులపై అధికారులు స్పందించారు. ఈనెల 16వ తేదీన నిల్వ నీరు.. తొలగించేదెవ్వరు'అనే శీర్షికతో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ సెక్రటరీ సీహెచ్ ప్రవీణ్ స్పందించి ఆక్రమణలు పరిశీలించారు. శనివారం జేసీబీతో ఆక్రమణ తొలగించి నిల్వ నీరు తొలగింపు చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ధర్మాన పరామర్శ



కృష్ణవేణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మాన తదితరులు

అరసవల్లి: స్థానిక కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు వడ్డి వైకుంఠం భార్య కృష్ణవేణి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం అరసవల్లిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు గంగు సీతాపతి, తెలుగు రమేష్, దుంగ సుధాకర్, ముకుందరావు, స్థానిక ప్రతినిధులు భైరి సూర్యనారాయణ, వెల్డింగ్ సత్తిబాబు, డబ్బీరు వెంకటరావు, బోయిన బాబూరావు, దోర రాజు, రుప్ప లక్ష్మణరావు, హరి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అక్రమ కేసులు సరికాదు



మాజీమంత్రి సీదిరితో మాట్లాడుతున్న మహిళా విభాగం నాయకురాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి టి.కామేశ్వరి మండిపడ్డారు. ఈ మేరకు పలాసలో శనివారం మాజీ మంత్రి నివాసంలో ఆయనను కలిసి భరోసానిచ్చారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు భారతిదివ్య ఉన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులు చదువుతోపాటు మంచి క్రమశిక్షణ, నడవడికను అలవర్చుకుంటే ఉత్తమ పౌరులుగా రాణించగలుగుతారని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద అన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన బాక్సింగ్ క్రీడాకారులను శనివారం శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో అభినందించారు. వీరిని తీర్చిదిద్దుతున్న హనుమాన్ బాక్సింగ్ క్లబ్ కోచ్ ఉమామహేశ్వరరావును ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. కార్యక్రమంలో లయన్ నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భౌబోంయ్..!

- నగరంలో కుక్కల స్వైర విహారం
- విచ్చలవిడిగా దాడులు చేస్తున్న వైనం
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు



ఆర్‌కే నగర్‌కాలనీలో నడిరోడ్డుపై గుంపుగా ఉన్న కుక్కలు



బొందిలిపురం రోడ్డులో గుంపుగా ఉన్న వీధి కుక్కలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని ఏ వీధికెళ్లినా.. ఏ ప్రధాన కూడలిలో తిరిగినా రాత్రి, పగలు అని తేడా లేకుండా వీధి కుక్కలు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. హోటల్స్, టిఫిన్ షాపుల్లో వచ్చే వృథా ఆహారాన్ని తినేందుకు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పలుచోట్ల మనుషులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. చిన్నారులు తెలిసీ తెలియక పరుగులు పెడితే వారిని వెంటపడి మరీ కరుస్తున్నాయి. దీంతో ఇటీవల కుక్కకాటుకి గురైన కేసులు అధికంగా నమోదవుతున్నాయి. నగరంలో దాదాపుగా ఊర కుక్కలు 12వేలకు పైగా, పెంపుడు కుక్కలు అధికారిక లెక్కల ప్రకారం 3 వేలకు పైగా ఉన్నాయి. పెంపుడు కుక్కలకయితే వాటి యజమానులు తగు జాగ్రత్తలు చేపట్టి టీకాలు వేయిస్తున్నారు. అంతేకాకుండా యాంటీ రేబిస్ వంటి టీకాలు కూడా ఎప్పటికప్పుడు వేయిస్తున్నారు. కానీ ఊర కుక్కలను మాత్రం నియంత్రించేవారే కరువయ్యారు. సంతానం లేకుండా చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినా.. కుక్కల నియంత్రణ ఏమాత్రం జరగలేదని నగరవాసులు చెబుతున్నారు. ఇటీవల నగరంలో ఓ చిన్నారిపై దాడి చేయడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిపోయింది. ఇంత జరుగుతున్నా కార్పొరేషన్ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

తూతూమంత్రంగా నియంత్రణ

జాతీయ జంతు సంక్షేమ మండలి సంస్థ (యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా) గైడ్ లైన్స్ ప్రకార ఏబీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అలా కనిపించడం లేదు. నగరపాలక సంస్థ నివారణ బాధ్యతలు చేపడితే నివారణకు సాధ్యమవుతుంది. ఇటీవల కాలంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ నగరంలో మాత్రం విచ్చలవిడిగా రోడ్లపై కుక్కలు తిరగడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు గ్రీన్‌మెర్సీ, నవంబర్ నుంచి స్నేక్ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వారు కుక్కల నియంత్రణ చేపడుతున్నట్లు అధికారులు చెప్పారు. కాగా ఈ నియంత్రణ కార్యక్రమం నిరంతరం ఒక డ్రైవ్‌లా చేయాలని, అలా కాకుండా అప్పుడప్పుడు తూతూమంత్రంగా చేస్తే ఉపయోగం ఉండదని నగరవాసులు చెబుతున్నారు. ఒక్కో కుక్కకి రూ.1,500 ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తున్నా దానిలో చాలావరకు అవతవకలు జరుగుతున్నాయని, అందుకే నియంత్రణ సక్రమం జరగడం లేదని చెబుతున్నారు. నిజానికి కుక్కలకు వాక్సిన్, ఆపరేషన్, పోస్ట్‌కేర్‌లో 3 రోజులు ఉంచుతారు. కానీ ఇవేవీ లెక్క ప్రకారం జరగడం లేదు. అందువలన ఇప్పటికైనా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం



కుక్కల నియంత్రణకు ఖాజీపేట యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటివరకు వేలాది కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టాం. ఇప్పటివరకు 4,500 పైగా కుక్కల ఆపరేషన్లు జరిగాయి. వాటికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్స్ వేయడం జరిగింది. వాటి క్రూరత్వాన్ని తగ్గించే వంటివి చేయడం జరుగుతోంది.

– పి.వి.వి.డి.ప్రసాదరావు, కార్పొరేషన్ కమిషనర్, శ్రీకాకుళం

భయమేస్తోంది



చీకటిపడితే చాలు కుక్కలు మీదపడి రెక్కేస్తున్నాయి. సాయంత్రమయితే చాలు బయటకు వచ్చేందుకు భయమేస్తోంది. నగరంలో ద్విచక్ర వాహనాలు, కార్లు వంటివాటిపై దూకుడుగా వెళ్తున్నాయి. స్కూళ్లు, ట్యూషన్లకి వెళ్లి, వచ్చేటప్పుడు విద్యార్థులు, చిన్నారులను కాటు వేస్తున్నాయి. దీనిపై అధికారులు స్పందించి నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

– ఎస్.రమేష్, హడ్కోకాలనీ, శ్రీకాకుళం నగరం

కూటమి కుట్రలు తిప్పికొట్టాలి



కోటి సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

రణస్థలం: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని ఎమ్మెల్సీ, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకుడు పెనుమత్స సురేష్ రాజు, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జేఆర్‌పురంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ హయాంలో కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ గొప్ప ఆశయానికి తూట్లు పొడిచి వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. దీనివలన గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు కనుమరుగు అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, రాష్ట్ర అనుబంధ వాణిజ్య విభాగం జాయింట్ సెక్రటరీ పచ్చిగుళ్ల సాయిరాం, రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీ అదపాక ఉదయ భాస్కర్, ఎచ్చెర్ల నియోజకవర్గ మహిళ నాయకురాలు గురాన తిరుమల మానస, నాయకులు రేగాన శ్రీను, గొర్లె అప్పలనాయుడు, దన్నాన హరి, ముద్దాడ రాజశేఖర్, మజ్జి రమేష్, టేకి బ్రహ్మాజీ, సర్పంచ్ బవిరి రమణ, ఇడదాసుల తిరుపతిరాజు, గుదే శారద, మహంతి అప్పలనాయుడు, కరిమజ్జి రమణ, పిన్నింటి లక్ష్మంనాయుడు, పెదరామినాయుడు, దన్నాన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

బిక్కుబిక్కుమంటూ..!



శిథిలావస్థలో ఉన్న రణస్థలం బీసీ హాస్టల్



బీసీ హాస్టల్‌లో పెచ్చులూడి ఉన్న పైకప్పు

- శిథిలావస్థలో వసతి గృహాలు
- భయం గుప్పిట్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

రణస్థలం: కూటమి ప్రభుత్వం వసతి గృహాల పర్యవేక్షణ గాలికి వదిలేసింది. శిథిల భవనాల్లో ఏ క్షణం పైకప్పు కూలిపోతోందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేక చదువుకోవాలనే లక్ష్యంతో మారుమూల గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులు వసతి గృహాల్లో వసతులు లేకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో గడుపుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో ఉన్న బీసీ, ఎస్సీ కళాశాలల వసతి గృహాల దుస్థితి అధ్వానంగా ఉంది. మరుగుదొడ్లు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి కనిపిస్తోంది. అలాగే తాగేందుకు శుద్ధ జలం లేక కలుషిత నీరు తాగి అనారోగ్యాల పాలవుతున్నారు. కిటికీలకు దోమ తెరలు లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. అలాగే ఎన్నో హాస్టళ్లకు ప్రహరీ గోడలు లేక పశువులు, కుక్కలు లోపలికి వచ్చేస్తున్నాయి.

విద్యార్థులకు అవస్థలు

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని రణస్థలం, లావేరు, ఎచ్చెర్లకు సంబంధించి 17 బీసీ హాస్టల్స్, 2 ఎస్సీ హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో పైడి భీమవరం, రణస్థలం బీసీ వసతి గృహాలు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ ఏ క్షణం పైకప్పు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. రణస్థలం బీసీ వసతి గృహం మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షలు కేటాయిస్తే, మూడు గదులను మాత్రమే చక్కగా తయారు చేశారు. అలాగే పాతర్లపల్లిలోని తుఫాన్ షెల్టర్ భవనంలో నడుస్తున్న బీసీ హాస్టల్ కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనాలకు ప్రహరీలు లేవు. అలాగే వంట తయారీ గది, భోజన శాలతో పాటు పలు గదులు పూర్తిగా పెచ్చులూడిపోయి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. కొన్నింట్లో కిటికీలకు దోమ తెరలు లేకపోవడం, మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



తరగతి గదిలో పెచ్చులూడి ఉన్న పైకప్పు చూపుతున్న విద్యార్థులు

ప్రతిపాదనలు పంపించాం

గత కొద్ది రోజులుగా బీసీ వసతి గృహాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో మరమ్మతులు చేపట్టాల్సి ఉందని ప్రతిపాదనలు పంపించాం. ఇంకా నిధులు రావాల్సి ఉంది. అలాగే పాతర్లపల్లి తుఫాన్ షెల్టర్ భవనం శిథిలావస్థలో ఉంది. అక్కడ నూతన భవనం నిర్మించాల్సి ఉంది. త్వరతగతిన నిధులు మంజూరైతే పనులు చేయిస్తాం.

– బి.దాసు, ఎఫ్ఏసీ ఏబీసీడబ్ల్యూవో రణస్థలం డివిజన్

ఆదిత్యాలయంలో టెండర్లు పూర్తి



టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో పలు అంశాలపై హక్కులకు శనివారం నిర్వహించిన టెండర్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో గ్రూప్ టెంపుల్స్ ఈవో సర్వేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ టెండర్లలో హెచ్చుపాటదారులకు నిబంధనల ప్రకారం పాటను ఖరారు చేశారు. ఇంద్రపుష్కరిణి ఒడ్డున మట్టి కలశాల విక్రయాలకు ఏడాది పాటు లైసెన్స్‌కు కెంబూరు లక్ష్మికి రూ.5,500లకు పాట ఖరారు చేశారు. అలాగే ఐరన్, స్టీల్, అల్యూమినియం, ప్లాస్టిక్ స్క్రాప్ పొందేందుకు హెచ్చుపాటదారునిగా కునుకు గోవింద్‌కు ఖరారు చేశారు. ఖాళీ ఐరన్ డబ్బా ఒక్కొక్కటి రూ.17 చొప్పున ఇచ్చేందుకు పాటను కొట్టి కామేశ్వరరావుకు ఖరారు చేశారు. ఇంద్రపుష్కరిణి చుట్టూ ఉన్న కొబ్బరి చెట్ల ఫలసాయం 3 నెలలకు గాను రూ.56 వేలు చెల్లించేలా గండేపల్లి మోహనరావుకు పాట దక్కింది. ఇక నవంబర్ 2న జరగనున్న ఆదిత్యుని హంసనావికోత్సవం కోసం తెప్ప వాహనం తయారీ, విద్యుత్ లైటింగ్, వీఐపీ డయాస్ ఏర్పాటు పనులకు గాను తక్కువపాట దారునిగా ఉంగటి పాపారావుకు పాటను ఖరారు చేశారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేద్దాం

శ్రీకాకుళం అర్బన్:

వాతావరణంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరమూ కృషి చేద్దామని ఆర్టీసీ డీపీటీవో సీహెచ్ అప్పలనారాయణ, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్‌ఎస్ శర్మలు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకాకుళంలోని కాంప్లెక్స్ నుంచి డే అండ్ నైట్ వరకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి కాలుష్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్యం వలన జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. అలా కాకుండా ఉండాలంటే మనమంతా గాలి కలుషితం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బ్యాటరీ వాహనాల వలన కాలుష్యం ఉండదని, ఇప్పటికే ఆర్టీసీలో బ్యాటరీతో నడిచే కొన్ని వాహనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ఎం ఎంపీరావు, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు పి.సంతోష్‌కుమార్, ఎ.గంగరాజు, ఆర్టీసీ సెక్యూరిటీ మూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు

పోషకాహారాన్ని అందించాలి



చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ విమల

ఎచ్చెర్ల: చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ పీడీ విమల సూచించారు. ఎచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తులు పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పొగాకుకు దూరంగా ఉండాలి



పొగాకు నిర్మూలన ర్యాలీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: విద్యార్థులు పొగాకుకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ డబ్బీరు గణేష్ పట్నాయక్ సూచించారు. ఈ మేరకు స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కోట తిరుపతిరావు, జగదీశ్వరరావు, సురేష్, సుబ్రహ్మణ్యం, నేతాజీ, అరుణకుమారి, ముత్యాలరావు, దుర్గారావు, నాగమణి, ప్రమీల, జ్యోత్స్న, ఆదినారాయణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకం లేదు

- శ్రీముఖలింగం ఆలయ అనువంశిక అర్చకుడు రాజశేఖర్



మాట్లాడుతున్న నాయుడుగారి రాజశేఖర్

శ్రీకాకుళం అర్బన్: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగం పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదాన పథకం లేదని, ఈ విషయాన్ని భక్తులందరూ గమనించాలని ఆ ఆలయ అనువంశిక అర్చకుడు నాయుడుగారి రాజశేఖర్ తెలిపారు. శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీకమాసం ఉత్సవాలు ఐదు రోజుల్లో ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో కొందరు దళారులు ఇప్పటికే అన్నదానం పేరిట అక్రమ వసూళ్లు చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గత సంవత్సరం కార్తీక మాసంలో అప్పటి దేవదాయ సిబ్బంది, కొంతమంది దళారులు కలిసి నిత్యాన్నదాన పథకం ఉందని మాయమాటలు చెప్పి భారీ మొత్తంలో భక్తుల నుంచి వసూలు చేశారని మండిపడ్డారు. అందువలన ఈ సంవత్సరం అటువంటి మాయమాటలు నమ్మవద్దని కోరారు. అన్నదానం పేరిట నిధులు వసూలు చేసి అన్నదానం చేయకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా భక్తులు అన్న ప్రసాదానికి వితరణ పేరుతో వివరాలు అందించవద్దని స్పష్టం చేశారు. ఈ సమాచారాన్ని భక్తులు గమనించవలసిందిగా ఆయన కోరారు.

సాఫ్ట్‌వేర్ పార్క్ సందర్శన



సందర్శనకు ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

ఎచ్చెర్ల:

స్థానిక ట్రిపుల్ ఐటీలో చదువుతున్న మెకానికల్ విభాగానికి చెందిన 51 మంది విద్యార్థులు విశాఖపట్నంలోని కల్పతరు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్‌ను శనివారం సందర్శించారు. రోబోటెక్నిక్, ల్యాబ్, డ్రోనోల్యాబ్, ఐఓటీ ల్యాబ్, 3డీ ప్రింటింగ్ ల్యాబ్‌లను సందర్శించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతలో ఆటో మిషన్ పద్ధతులు, స్మార్ట్ పరికరాలు, పరిశ్రమలో ఉపయోగించే డిజిటల్ ఇన్నోవేషన్ విధానాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో మునిరామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమీ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి సీహెచ్ వాసు, మెకానికల్ విభాగాధిపతి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

గార: విద్యార్థినులు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్ గంగరాజు సూచించారు. శనివారం దీపావళి జంక్షన్ సమీపంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో నారీశక్తిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలు సరైన రీతిలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కి పాల్పడితే ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైమ్స్‌పై అవగాహన ఉండాలని, టోల్ ఫ్రీ నంబర్ 1093కి సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యంతో జీవ వైవిధ్యానికి నష్టం



పర్యావరణంపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

శ్రీకాకుళం పాతబస్టాండ్: కాలుష్యంతో జీవ వైవిధ్యానికి నష్టం కలుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం బ్యాటరీ బైకులతో కలెక్టరేట్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొల్యూషన్ లేని వాహనాలు, సోలార్లు వాడడం వలన జీవ వైవిధ్యానికి నష్టం ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి జీఏ సూర్యనారాయణ, ఆయా విభాగాల పర్యవేక్షకులు రామ్మూర్తి, సురేష్, రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.